ఈఎస్ఐలో ఫార్మసిస్ట్ వేడుకలు



మల్లాపూర్: నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గ్రేడ్-1 ఫార్మసిస్టులు దయానంద, గౌసియా, సుప్రియ, యూనిట్ అధ్యక్షురాలు విక్టోరియా, కార్యదర్శి వేణుకుమార్, ఈఎస్ఐ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులను గుర్తించాలి

ఉప్పల్: మూసీ పరివాహక ప్రాంతాల్లో నివస్తున్న వారికి డబుల్ బెడ్రూమ్ కేటాయింపులో భాగంగా బుధవారం ఉప్పల్, కాప్రా సర్కిళ్ల పరిధిలో సర్వే ప్రారంభమైంది. బుధవారం జిల్లా కలెక్టర్ గౌతమ్, జేసీ విజయేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి పరిధి అధికారులతో ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు పలు సూచనలు చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారిని అక్కడి నుంచి తొలగించే ముందు వారికి డబుల్ బెడ్రూమ్‌లను అందించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్వాసితులను పారదర్శకంగా గుర్తించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో నిరుపేదలు నిరాశ్రయులు కారాదని, వారికి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే ఆక్రమణలను తొలగించాలని సూచించారు. జిల్లా పరిధిలో దాదాపుగా 232 కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారిని గుర్తించి జాబితాను అందజేయాలని సూచించారు.

అంత్యక్రియలకు అన్నీ అగచాట్లే !

- ముళ్ల చెట్లు, చెట్ల పొదలు, జంతువుల సంచారం
- సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు
- రెండు శ్మశానవాటికలను మోడల్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని రాజేంద్రనగర్, నేతాజీనగర్‌లో ఉన్న హిందూ శ్మశానవాటికల్లో అడుగు పెట్టకుండా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, ఇతర చెట్లపొదలు, కుక్కలు, పందులు, అప్పుడప్పుడు సర్పాలు సంచరిస్తున్నాయి. ఈ శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు తమ బంధువులు, ఆత్మీయులు చనిపోయినప్పుడు వారి అంత్యక్రియలు ఈ శ్మశానవాటికలను నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ నేతాజీనగర్ శ్మశానవాటికకు ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో ఈ శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న ఇళ్లల్లో నుంచి చెత్తాచెదారం శ్మశానవాటికల్లోనే వేస్తున్నారు. దీంతో ఓ వైపు చెత్త, చెదారంతో నిండిపోయింది. గతంలో దాదాపు రూ.50 లక్షలతో నిర్మించిన స్నానపు గదులు, అంత్యక్రియలకు వచ్చే ఆత్మీయులు కూర్చునే షెడ్డుతో పాటు



చెత్త, చెదారంతో నేతాజీనగర్ శ్మశానవాటిక ఇలా..



ఉప్పల్ సర్కిల్ డివిజన్‌లోని శ్మశానవాటికలను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ అధికారులు నిధులు కేటాయిస్తున్నారు. కానీ రామంతాపూర్‌లో ఉన్న రెండు హిందూ శ్మశానవాటికల అభివృద్ధిపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ.. అవసరమైన నిధులు కేటాయించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆస్తికలను భద్రపరిచే గదులు, నీటి ట్యాంకులను సక్రమంగా నిర్వహించకపోవడంతో అవి పనికి రాకుండా పోతున్నాయి. ఈ రెండు శ్మశానవాటికల్లో తరచూ బోరు పంపులు చెడిపోవడంతో పాటు వాటి మోటార్లు కాలిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దహన వాటికల్లో అంత్యక్రియలు నిర్వహించేటప్పుడు వెలువడే పొగ శ్మశానవాటికలకు దగ్గరగా ఉన్న నేతాజీనగర్, రాజేంద్రనగర్, అరవింద్‌నగర్, ఇంద్రానగర్‌లోకి వ్యాపిస్తుంది. ఈ దహన వాటికలపై చిమ్నీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి సూచనలు..

రామంతాపూర్‌లో ఉన్న రెండు హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు స్థానికులు పలు పరిష్కారాలు సూచించారు.

◆ నేతాజీనగర్ శ్మశానవాటిక ప్రహరీ ఎత్తు పెంచడంతో పాటు ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, చెట్ల పొదలను తొలగించకపోవడం, శ్మశాన వాటికలో ఉన్న స్నానపు గదులు ఇతర గదులను ప్రతిరోజూ శుభ్రపరిచేలా చర్యలు తీసుకుని అందుబాటులోకి తీసుకురావడం.

◆ రెండు శ్మశానవాటికల్లో ఉన్న దహన వాటికల్లోని పొగ సమీపంలో ఉన్న బస్తీ కాలనీలో వ్యాపించకుండా దహనవాటికలపై చిమ్నీలు అమర్చాలి.

◆ బోరు పంప్‌లు, మోటార్లు తరచూ చెడిపోకుండా వెంటవెంటనే వాటికి మరమ్మతులు చేయించడం లేదా కొత్త ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులు చేపట్టాలి.

◆ రెండు శ్మశానవాటికలను మోడల్ శ్మశానవాటికలుగా తీర్చిదిద్ది అహ్లాదకరంగా ఉండేలా సుందరీకరణ చేయడానికి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

శ్మశానవాటికలను మోడల్‌గా తీర్చిదిద్దాలి



ఉప్పల్ సర్కిల్ పరిధిలోని కొన్ని శ్మశానవాటికల ఆధునీకరణకు జీహెచ్ఎంసీ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంది. గత కొన్నేళ్లుగా రామంతాపూర్ హిందూ శ్మశానవాటికలను అధికారులు పట్టించుకోకుండా నిధులు మంజూరు చేయడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేసి మోడల్ శ్మశానవాటికలుగా తీర్చిదిద్దాలి.

– సతీష్, ఆర్టీసీ కాలనీ, రామంతాపూర్

దహన వాటికలపై చిమ్నీలు బిగించాలి



ఈ రెండు శ్మశానవాటికలలోని దహన వాటికల్లో అంత్యక్రియలు నిర్వహించేటప్పుడు వచ్చే పొగ సమీపంలో ఉన్న బస్తీల్లోకి కాలనీలోకి వచ్చి చేరుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి దహనవాటికలపైన అతి ఎత్తుగా బిగించాలి.

– లింగం యాదవ్, నేతాజీనగర్

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ రాయల్ ఎన్‌క్లేవ్‌లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయల్ ఎన్‌క్లేవ్, ధర్మా కాలనీలోని ఓపెన్ నాలాకు మరమ్మతులు చేసి పైకప్పు స్లాబ్ వేయాలని, కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్డు, డ్రైనేజీ లైన్లు వేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రదీప్, నాగిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, అనిల్‌రావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

బోడుప్పల్: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం 28వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీతో పాటు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకూడదని, వాటి స్థానంలో చేతి సంచులను వాడాలని మార్కెట్ స్థలాలు, షాపుల్లో అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్, హెల్త్ అసిస్టెంట్ వినోద్, స్వచ్ఛ భారత్ మిషన్ కో-ఆర్డినేటర్లు మల్లేష్, మహేందర్ పాల్గొన్నారు.

రోడ్లకు ప్యాచ్‌వర్క్స్



పనులను ప్రారంభించిన కార్పొరేటర్ హేమలతారెడ్డి

బోడుప్పల్: రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఈస్ట్ హనుమాన్‌నగర్ కాలనీలో బుధవారం ప్యాచ్‌వర్క్స్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రాధాన్యతను ఇచ్చి పనులు చేపడుతున్నామన్నారు. ఈస్ట్ హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షులు పులకండ్ల జంగారెడ్డి, కాలనీవాసులు తిరునగరి ప్రమోద్‌కుమార్, దొంతి రమేష్‌కుమార్, గడ్డం నరేందర్‌కుమార్, పద్మ, ధనలక్ష్మి, సరస్వతి, సులోచన పాల్గొన్నారు.

స్వచ్ఛతలో అందరూ భాగస్వాములవ్వాలి



మహారాష్ట్ర ఇండోర్ సిటీ మేయర్‌తో కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్

మౌలాలి: మహారాష్ట్ర ఇండోర్ సిటీ మేయర్ పీయుష్ మిత్ర భార్గవ్‌ను మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇండోర్ సిటీ గురించి స్వచ్ఛత ప్రకృతి పర్యావరణానికి తోడ్పడేలాగా ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆయన తెలిపారు.

ఇండోర్‌లో చెత్త సేకరణపై అధ్యయనం

మల్కాజిగిరి: జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల పర్యటనలో భాగంగా బుధవారం ఇండోర్‌లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అక్కడ ఇంటింటి నుంచి జరిగే చెత్త సేకరణను పరిశీలించారు. చెత్త సేకరించే వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రవణ్ మాట్లాడుతూ.. చెత్త సేకరణలో భాగంగా తడి,పొడి చెత్తను ఖచ్చితంగా వేరుచేస్తున్నారన్నారు. ముఖ్యంగా అక్కడి అంబేడ్కర్‌నగర్‌లో నాలా పక్కన నివసిస్తున్న ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా పండుగలు నిర్వహించుకోవడం బాగుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేస్తున్నారని మన ప్రాంతంలో కూడా ఈ అవగాహన రావాలన్నారు.



ఆటోలో చెత్త సేకరణను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

ఉచిత నేత్ర వైద్య శిబిరం



అల్వాల్: కౌకూర్‌లోని జెనెసిస్ గ్రామర్ హైస్కూల్‌లో విషన్ 6.6.కామ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజఫిర్ మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్లకు పలువురు విద్యార్థులు ప్రభావితం అవుతున్నారన్నారు. సాధ్యమైనంత వరకు తక్కువగా ఫోన్‌లను ఉపయోగించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వనజ, కరస్పాండెంట్ మోసెస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ



ప్రమాదబీమా చెక్కును కస్టమర్‌కు అందజేస్తున్న దృశ్యం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్కాజిగిరి బ్రాంచీ ఎస్‌బీఐ బ్యాంకులో బుధవారం కస్టమర్‌కు ప్రమాదబీమా రూ.20 లక్షల చెక్కును బుధవారం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఉమాకాంత్ రవికిరణ్, చీఫ్ మేనేజర్ నగేష్, బ్రాంచీ మేనేజర్ సాయిలతలు అందజేశారు. రవికిరణ్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ అందించే పలు సేవలను కస్టమర్లు వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు కస్టమర్లు ఇన్సూరెన్స్ చేసుకుని కుటుంబానికి భరోసా ఇవ్వాలని కోరారు.

స్థానికులపై దాడికి పాల్పడిన ఇద్దరి రిమాండ్

అల్వాల్: స్థానికులపై దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదైన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ నాగిరెడ్డి కాలనీలో రాత్రి అల్వాల్ ప్రాంతానికి చెందిన మహేష్‌యాదవ్, శ్రీకాంత్, నరేష్‌యాదవ్‌లు కలిసి మద్యం సేవించారు. అనంతరం కాలనీలో మూత్ర విసర్జన చేస్తుండగా.. కాలనీవాసులు అజయ్, మోహన్‌రెడ్డిలు ఇళ్ల మధ్యలో మూత్ర విసర్జన చేయడం ఏమిటని వారిని ప్రశ్నించడంతో గొడవ జరిగింది. ఈ ఘటనలో అజయ్, మోహన్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

ఉప్పల్: ఉప్పల్ నియోజవర్గ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎడ్యుకేషన్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేరని, కొన్నిచోట్ల పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. స్కూల్స్‌లో టాయిలెట్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులతో విద్యార్థులు విద్యను కొనసాగించలేకపోతున్నారని తెలిపారు.

చిలుకాగర్ ప్రభుత్వ పాఠశాలలో..

చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 550 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, వర్షం వచ్చినప్పుడల్లా తరగతి గదులు కురుస్తున్నాయని, వెంటనే కొత్త భవనం నిర్మించాలని ఎమెల్యే కోరారు. దీంతో స్పందించిన డైరెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గందం నాగేశ్వర్‌రావు, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



మల్లాపూర్‌లో ఫుట్‌పాత్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

మల్లాపూర్: మల్లాపూర్ శివహోటల్ నుంచి ఓల్డ్ విలేజ్‌కు వెళ్లేదారిలో చర్చి వరకు రోడ్డు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. కూల్చివేస్తున్న సమయంలో పలువురు కూల్చివేయొద్దంటూ..ఏసీపీ గిరిరాజ్‌తో వాగ్వివాదానికి దిగారు. చైన్‌మెన్‌లు రాజు, గంగాధర్, సిబ్బంది ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి





కుషాయిగూడలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నేతలు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని కృపా కాంప్లెక్స్ మా ఫర్నీచర్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నాయకులు ఓంప్రకాష్, శ్రీకాంత్‌యాదవ్, సాయిసురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుషాయిగూడ: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం కుషాయిగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ చర్లపల్లి డివిజన్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుషాయిగూడలో బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. మోదీపై విశ్వాసంతో ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని డివిజన్ పార్టీ అధ్యక్షుడు నాదం పేర్కొన్నారు. బీజేపీ నేతలు గణేష్‌ముదిరాజ్, ఆనంద్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, చల్లా ప్రభాకర్, రాంబాబు, దయానంద్, శ్రీనివాస్, విద్యాసాగర్, అప్పినాయి, వెంకటేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలు

అల్వాల్: జీహెచ్ఎంసీ వర్కర్ల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులకు మల్కాజిగిరి కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు పనిచేస్తున్న జీహెచ్ఎంసీ వర్కర్లకు ముగ్గురు వ్యక్తులు శ్రీకాంత్ (24), లింగస్వామి (28), ప్రశాంత్ (27)లు ఫూటుగా మద్యం సేవించి తాగిన మత్తులో గొడవపడ్డారు. దీంతో జీహెచ్ఎంసీ వర్కర్లు 100కి డయల్ చేయగా.. నేరేడ్‌మెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకోగా.. వారు మద్యం మత్తులో పోలీసులతో కూడా దురుసుగా ప్రవర్తించి వారి విధులకు కూడా ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు మూడు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2,720 జరిమానా విధించారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి వేడుకలు



దీన్‌దయాళ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాంచందర్‌రావు, రాజ్యలక్ష్మి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించిన దృశ్యం

మౌలాలి: పండిట్ దీన్‌దయాళ్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో దీన్ దయాళ్ నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ సేవనే జీవిత పరమావధిగా ఏకాత్మతా మానవతావాదాన్ని కలిగిన వ్యక్తి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు కొనియాడారు. కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, థియోయిరెడ్డి, సిమిరెడ్డి, అధ్యక్షులు జూలూరి శ్రీనివాస్, కార్యదర్శులు సూర్యనారాయణమూర్తి, రామకృష్ణ, సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి శివపురి కాలనీలోని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు రాంబాబు, ప్రభుగుప్తా, ఆనంద్, సునీల్‌యాదవ్, ఆనంద్, సాయి, రవి దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అల్వాల్: భారతీయ జన సంఘ్ నుంచి బీజేపీ ఆవిర్భావం వరకు సిద్ధాంతకర్తగా ప్రతి ఒక్కరికి మార్గనిర్దేశనం చేసిన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గంలో అందరం సాగాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వారోత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు ఉదయప్రకాష్, రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు అజయ్‌రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, రామ్మోహన్‌గౌడ్, రాఘవేంద్రచారి, రమాకాంత్, సునీత్, లక్ష్మీకాంతశర్మ, కరుణశ్రీ, అనురాధ కవిత తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కోశాధికారి వెంకట్‌రెడ్డి

మల్లాపూర్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో టీయూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల నుంచి జిల్లా పట్టాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈనెల 27 వరకు దరఖాస్తు ఫారాలను అన్ని వివరాలతో పూర్తి చేయాలని సూచించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ)మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రామ్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కమిటి ప్రతినిధులు కేసీ మోహన్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, అక్బర్, చంద్రమౌళి, విజయ్, శ్రీధర్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్, ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే గిరిజన సమస్యల పరిష్కారం

జవహర్‌నగర్: పోరాటాలతోనే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని, గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు శ్యామల లత ఆధ్వర్యంలో అక్టోబర్ 6న నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జవహర్ నగర్ జవహర్‌నగర్ దళిత భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... సాంస్కృతిక పోరాటంలో భాగంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 6న బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితం అంధకారం

పోచారం: సమాజంలో ఎంతో మంది డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ కె.సుబ్బిరామ్‌రెడ్డి అన్నారు. బుధవారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నార్కోటిక్స్ బ్యూరోతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బిరామ్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి అలవాటుపడి జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. ఇష్టంతో కష్టపడి చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. రోజురోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులచే గౌరవ అతిథిగా పాల్గొన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌ఓడీలు, టీపీఓ కే.శ్రీకాంత్, యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఇ.చంద్రశేఖర్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.